సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలి.. పిండి వంటలు తయారీ

- హోంఫుడ్స్ వ్యాపారంలో రాణిస్తున్న సాహితి
- ఆన్‌లైన్ ద్వారా ఆర్డర్లు.. విదేశాలకు ఎగుమతులు
- ఫ్లేవర్స్ ఆఫ్ తెలుగు పేరిట ఇన్‌స్టాగ్రామ్‌లో పేజీ
- 2.9 లక్షల మంది ఫాలోవర్లు

7



పిండి వంటలు చేస్తున్న మహిళలు (ఇన్‌సెట్‌లో సాహితి)

అందని ఆయుర్వేద వైద్యం

- విధులకు హాజరుకాని డాక్టర్
- పట్టించుకోని అధికారులు



బెజ్జూరులోని ఆయుర్వేద వైద్యశాల

6

వంతెన పూర్తయ్యేదెన్నడు..?

- సందిగ్ధంలో మంచిర్యాల-అంతర్గాం బ్రిడ్జి
- ఇప్పటికే పూర్తయిన సాయిల్ టెస్టింగ్
- నిర్మాణానికి శంకుస్థాపన చేసిన కేసీఆర్
- పనులు ప్రారంభించే దశలో నిలిచిన వైనం

మంచిర్యాల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల వద్ద అంతర్గాం-మంచిర్యాల గోదావరి వంతెన నిర్మాణం సందిగ్ధంలో పడింది. గోదావరిపై వంతెన నిర్మించాల్సిన ప్రాంతంలో ఆర్ అండ్ బీ అధికారులు సర్వే చేపట్టి సాయిల్ టెస్టింగ్ ప్రక్రియ కూడా పూర్తయింది. అయితే నిధులు విడుదల చేసి, పనులు ప్రారంభించే దశలో అర్థాంతరంగా నిలిచిపోయింది. 2018లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం కోసం శ్రీరాంపూర్ బహిరంగ సభకు హాజరైన అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ హామీలో భాగంగా వంతెన నిర్మాణానికి మోక్షం లభించింది. మొదట రూ. 125 కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసిన ప్రభుత్వం తదనంతరం దానిని రూ. 165 కోట్లకు పెంచుతూ జీవో జారీ చేసింది. వంతెన నిర్మాణం పూర్తయితే మంచిర్యాల-పెద్దపల్లి జిల్లాల మధ్య దూరభారం తగ్గనుంది. ప్రస్తుతం కరీంనగర్ వైపు వెళ్లేందుకు గోదావరిఖని మీదుగా ప్రయాణించాల్సి రావడంతో దూరం ఎక్కువగా ఉంది ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.



వంతెన నిర్మాణం కోసం జరుపుతున్న సాయిల్ టెస్ట్ (ఫైల్)

● తగ్గనున్న దూరభారం..

మంచిర్యాల వద్ద గోదావరి నదిపై వంతెన నిర్మాణం పూర్తయితే గరిష్ఠంగా దూరం తగ్గనుంది. రెండు జిల్లాల మధ్య కనీసం 40 కిలోమీటర్ల దూరం తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుతం కరీంనగర్, హైదరాబాద్ లాంటి సుదూర ప్రాంతాలకు ప్రయాణం చేయాలంటే గోదావరిఖని మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. మంచిర్యాల -శ్రీరాంపూర్-గోదావరిఖని వరకు వెళ్లేందుకు ట్రాఫిక్ కారణంగా అధనంగా సమయం వెచ్చించాల్సి వస్తోంది. వంతెన నిర్మాణం పూర్తయితే మంచిర్యాల నుంచి బసంత్‌నగర్ కరీంనగర్, హైదరాబాద్‌లకు చేరుకునే వెసులుబాటు ఉంటుంది.

● పూర్తయిన టెండర్..

గోదావరి వంతెనకు సంబంధించి ఇప్పటికే టెండరింగ్ ప్రక్రియ పూర్తి కాగా కాంట్రాక్టర్‌కు అగ్రిమెంట్ కూడా చేశారు. వంతెన నిర్మాణం కోసం టెండర్ ప్రక్రియ ముగియడంతో అధికారులు సర్వే పనులు కూడా చేపట్టారు. ప్రభుత్వం అంచనా వ్యయంకోసం పరిపాలనా అనుమతులు మంజూరు చేయడంతో పనులు ప్రారంభమయ్యే దశలో ప్రభుత్వం మారడం...కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో వంతెన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ పూర్తయిన నాటి నుంచి గరిష్ఠంగా సంవత్సర కాలంలో వంతెనను నిర్మించాల్సి ఉంది. వంతెన నిర్మాణంలో భాగంగా జిల్లా కేంద్రంలోని గోదావరి నది వద్ద ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భావ్‌సింగ్ ఆధ్వర్యంలో అధికారులు సర్వే నిర్వహించారు.

● ఆందోళనల మధ్య..

గోదావరిపై వంతెన నిర్మిస్తామని కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు ప్రజలు ఆందోళనబాట పట్టారు. గోదావరి వంతెన సాధన సమితి ...

మిగతా 7లో

చోరీ కేసులో ఒకరికి జైలు శిక్ష

దండేపల్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలం రాంపూర్ గ్రామానికి చెందిన మహ్మద్ రజాక్(21) అనే యువకుడు దండేపల్లి మండలంలోని మేదరిపేట, గూడెంలో చోరీ చేసిన కేసులో లక్షెట్టిపేట కోర్టు సివిల్ జడ్జి మహ్మద్ అసుదుల్లా షరీఫ్ బుధవారం మూడు నెలల 6రోజులు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పినట్లు ఎస్సై ఉదయ్‌కిరణ్ తెలిపారు. మండలంలోని మేదరిపేట గ్రామానికి చెందిన కాంద్రాపు సరస్వతి ఇంట్లో గత ఏడాది ఆగస్టు 22న చొరబడి తులం బంగారు చైన్, రూ. 5వేల నగదు దొంగిలించారు. గూడెంలో 27-09-24లో చుంచు సురేష్ ఇంట్లో పగలు ఇంట్లో ఎవరు లేని సమయంలో చొరబడి బీరువాలో ఉన్న రూ.20వేల నగదును దొంగిలించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, నిందితుడిని కోర్టులో హాజరు పరిచారు. నేరం రుజువుకావడంతో మహ్మద్ రజాక్‌కు శిక్ష ఖరారు చేశారు.

రైతులకు అవగాహన

మందమర్రిరూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : అందుగులపేట, పులి మడుగు గ్రామల్లో రైతులకు వరి సాగులో తీసుకోవల్సిన చర్యలపై ఏడీఏ బానోత్ ప్రసాద్ బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు లు వరి పొలం మడుల్లో తూర్పు పడమరలుగా ప్రతి రెండు మీటర్లకు 20 సెంటీమీటర్ల ఎడంతో కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కాలి బాటలు తీ యడం వల్ల వరి ఏపుగా పెరుగుతుందని తెలిపారు. చీడ పీడలు పట్టకుండా ఉంటాయన్నారు. రైతులకు సందేహాలుంటే అధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏవో కిరణ్మయి, ఏఈవోలు ముత్యం తిరుపతి, కనకరాజు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

జన్నారం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపేట, ఇందన్‌పల్లి యుపీఎస్ పాఠశాలలు, మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలను బుధవారం డీఈవో యాదయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం ఎలా ఉంటుందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పది పరీక్షల్లో మండలం మొదటి స్థానంలో నిలిచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఆయన వెంట ఎంఈవో విజయ్‌కుమార్ ఉన్నారు.

ఉపాధ్యాయుడి సస్పెన్షన్

జన్నారం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్యాలలోని గిరిజన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయుడు లక్ష్మణ్ నాయక్‌ను సస్పెండ్ చేస్తూ ఉట్నూరు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఉత్తర్వులు జారీ చేసినట్లు నిర్మల్ డీటీడీవో, మంచిర్యాల ఇన్‌చార్జి జాదవ్ అంబాజీ తెలిపారు. లక్ష్మణ్ నాయక్ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తుండడంతో సస్పెండ్ చేశామని ఆయన తెలిపారు.

నలుగురి బైండోవర్

హాజీపూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : గతంలో కోడి పందాలు నిర్వహించిన నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని బుధవారం తహసీల్దార్ శ్రీనివాస్ రావుదేశ్‌పాండే ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్ఐ గోపతి సురేష్ తెలిపారు. సంక్రాంతి పండగ సందర్భంగా మండలంలో కోడి పందాలు, పేకాట ఆడితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రోడ్డుపై గుంతలను పూడ్చిన పోలీసులు

భీమిని, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి వెళ్లే కన్నెపల్లి మండలంలోని టేకులపల్లి రాంపూర్ ప్రధాన రహదారిపై ఉన్న గుంతలను స్థానిక పోలీసులు పూడ్చే పనులను బుధవారం చేపట్టారు. మూడు కిలోమీటర్ల మేరకు ఉన్న గుంతల్లో ట్రాక్టర్లతో 50 ట్రిప్పుల మట్టి మొరాన్ని వేయించి చదును చేయించారు. ఎస్సై విజయ్‌కుమార్ మాట్లాడుతూ మూడు కిలో మీటర్ల మేర రహదారిపై గుంతలు పడడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ట్రాక్టర్ యజమానుల సహకారంతో గుంతలను పూడ్చి వేశామన్నారు.



గుంతలను చదును చేయిస్తున్న ఎస్సై విజయ్‌కుమార్

టీబీజీకేఎస్ చేసింది శూన్యం

తాండూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు టీబీజీకేఎస్ చేసింది శూన్యమని ఐఎన్‌టీయూసీ నాయకులు అన్నారు. స్థానికంగా బుధవారం పలువురు మాట్లాడుతూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సింగరేణి కాంగ్రెస్ పార్టీ, ఐఎన్‌టీయూసీ గురించి ఇష్ట రీతిన మాట్లాడడం సరైంది కాదన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, ప్రకాష్‌రావు, చంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న గోవులు పట్టివేత

జన్నారం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జన్నారం మండల కేంద్రంలో బుధవారం ఎస్‌బీఐ బ్యాంకు వద్ద ట్రాలీ ఆటోలో రెండు ఆవులను ఎలాంటి రశీదులు లేకుండా తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు. బ్యాంకు సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా జన్నారంకు మహ్మద్‌ఖాన్ అనే వ్యక్తి గోవులను తరలిస్తున్నాడనే సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సర్వే పూర్తి చేయాలి

జైపూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్లాట్లు ఉన్న యాజమానులు ఎల్ఆర్ఎస్ సర్వేను పూర్తి చేసుకోవాలని ఎంపీవో శ్రీపతి బాపురావు అన్నారు. బుధవారం మండలంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తు చేసుకున్న వారి ప్లాట్లను సర్వే చేశారు.

జనగామ రూట్‌లో బస్‌సేవలు ప్రారంభం

కోటపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జనగామ రూట్‌లో బుధవారం నుంచి బస్ సేవలు ప్రారంభమయ్యాయి. ఇంతకాలం బస్ సేవలు లేక ప్రజలు ఇబ్బందులు పడగా ఈ విషయాన్ని ఎమ్మెల్యే వివేక్ దృష్టికి తీసుకువెళ్లడంతో ఆర్టీసీ అధికారులతో మాట్లాడి చెన్నూరు నుంచి జనగామ వరకు బస్సును ప్రారంభించారు. దీంతో ఈ రూట్‌లో ఉన్న పది గ్రామాల ప్రజలకు ఆర్టీసీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. బస్సు సేవల పునరుద్ధరణకు చర్యలు తీసుకున్న ఎమ్మెల్యేకు పది గ్రామపంచాయతీల మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు కృతజ్ఞతలు తెలిపారు. కాగా జనగామకు వచ్చిన బస్సుకు మాజీ సర్పంచు గట్టు లక్ష్మణ్‌గౌడ్ ఆధ్వర్యంలో స్థానికులు ఆహ్వానించారు. అనంతరం డ్రైవర్‌తో పాటు కండక్టర్‌ను సన్మానించారు.



ఆర్టీసీ బస్సుకు స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

పరీక్షల షెడ్యూల్ విడుదల

మంచిర్యాల క్రైం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు 2024.25 పరీక్షల షెడ్యూల్ విడుదల అయినట్లు మంచిర్యాల డీఈవో యాదయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 నుంచి 17 వరకు డ్రాయింగ్ లోయర్, హైయర్ గ్రేడ్, 11న టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ లోయర్ గ్రేడ్ పరీక్షలు ఉంటాయని తెలిపారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

జన్నారం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ సయ్యద్ పసివుల్లాలతో పాటు డైరెక్టర్లు రేగుంట ప్రవీణ్, ఎల్ల లావణ్య, తిరుపతి, సోనేరావులను బుధవారం అంబేద్కర్ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన
వేతనాలు చెల్లించాలని నోటీసులు



జారీ చేసిన నోటీసు

లక్సెట్టిపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య శాఖలో పని చేస్తున్న తాత్కాలిక ఉద్యోగుల వేతనాల జాప్యంపై అధికారులు మండిపడ్డారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో వచ్చిన 'పండుగ పూటా పస్తులేనా' అనే వార్త కథనానికి తెలంగాణ వైద్య విధాన పరిషత్ జిల్లా హెడ్‌క్వార్టర్స్ సూపరిండెంట్ స్పందించి కాంట్రాక్టు ఉద్యోగులకు రెండు రోజుల్లో వేతనాలు అందజేయాలని లేదంటే అగ్రిమెంట్ ప్రకారం శాఖపరమైన చర్యలు తప్పవని బుధవారం నోటీసులు జారీ చేశారు. మూడు నెలలు దాటితే ప్రభుత్వం బిల్లు మంజూరు చేసిన చేయకున్న కాంట్రాక్టర్ కార్మికులకు వేతనాలు అందిచాలని ముందుగానే అగ్రిమెంట్‌లో ఉంటుందన్న విషయం ప్రతీ కాంట్రాక్టర్ గుర్తు ఉంచుకోవాలని సూచించారు. బెల్లంపల్లి, చెన్నూర్, లక్సెట్టిపేటకు చెందిన ఏజన్సీలు ఎస్ఎస్‌వీ క్రియేషన్స్, శివబాలాజీ కన్సల్‌టెన్సీలకు నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు.

విద్యుత్ సరఫరా నిలిపివేయడం సరికాదు



కార్మిక కుటుంబాలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సింగరేణి కార్మికుల క్వార్టర్లకు ఇళ్ల పట్టాలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటికి విద్యుత్ సరఫరా నిలిపి వేయడం సరికాదని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. బుధవారం పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించారు. గత నాలుగు రోజులుగా సింగరేణి యాజమాన్యం సింగరేణి క్వార్టర్లకు విద్యుత్ కనెక్షన్లను తొలగించడం హేయమైన చర్య అన్నారు. బీఆర్ఎస్ హయాంలో కార్మికుల కుటుంబాలందరికీ ఇళ్ల పట్టాలు అందజేసి వారి అభివృద్ధికి కృషి చేశామన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఏడాది కాలంలోనే ప్రజా వ్యతిరేక ప్రభుత్వంగా ముందుకు వెళ్తుందన్నారు. సింగరేణి కార్మికులకు వెంటనే విద్యుత్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, నాయకులు నూనేటి సత్యనారాయణ, అలి, సబ్బని అరుణ్, మౌనిక్, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు అంటించిన బీఆర్ఎస్ నాయకులు

చెన్నూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎగ్గొట్టిన రైతు భరోసా విడుదల చేయాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు బుధవారం మండలంలోని ఆస్నాద గ్రామంలో కరపత్రాలను ఇంటి గోడలకు అంటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ప్రజలను మోసం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ రాజారమేష్, మాజీ ఎంపీపీ మంత్రి బాపు, మాజీ జెడ్పీటీసీ మోతె తిరుపతి, దామోదర్‌రెడ్డి, ఏలేశ్వరం, నర్సింహాచారి, సమ్మిరెడ్డి,వెంకటేశ్వర్‌రావు, రవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

భీమారం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ఫీల్డ్ అసిస్టెంట్‌ల సమస్యలను పరిష్కరించాలని బుధవారం ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ నాయకులు ఈద లింగయ్య, రాజన్న, భీమాలు డీఆర్‌డీవోకు వినతి పత్రం అందించారు.కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు వేణు, రజిని, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

నెన్నెల, జనవరి 8(ఆంధ్రజ్యోతి): యూత్ ఆధ్వర్యంలో కుశ్నపల్లిలో నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీలను బెల్లంపల్లి జూనియర్ కళాశాల పీడీ బాబురావు బుధవారం ప్రారంభించారు. యువత క్రీడలతో పాటు చదువుపై దృష్టి పెట్టాలన్నారు. పల్లె క్రీడాకారుల ప్రతిభ ప్రపంచానికి చాటేందుకు ఇలాంటి టోర్నమెంట్లు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు రామటెంకి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

దండేపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండల కేంద్రంకు చెందిన జిల్లపెల్లి పవన్‌కళ్యాణ్, మంద రాజు అనే యువకులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బుధవారం కాంగ్రెస్ నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు తన వంతు సాయంగా ఒక్కొక్కరికి పది వేల రూపాయలు పంపించడంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్జీపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గండ్రం త్రిమూర్తి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, మార్కెట్ కమిటి డైరెక్టర్ రాజన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జెండా పండుగ

తాండూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్చలాపూర్ గ్రామంలో బుధవారం ఆదివాసం కొలావార్ జెండా పండుగను ఘనంగా నిర్వహించారు. ఆదివాసీ కొలవార్ నాయకుడు బోగారం సంతోష్ జెండాను ఎగురవేశారు. మహిళలు మంగళహారతులతో జెండా వద్దకు వచ్చి భీమదేవరకు పూజలు చేశారు. కార్యక్రమంలో తాండూర్ తహసీల్దార్ , ఎంపీడీవో శ్రీనివాస్, సీఐ కుమారస్వామి, నాయకులు గట్టు మురళీధర్‌రావు, గట్టు సంతోష్, ఆదివాసీ నాయకులు సత్తయ్య, కిష్టయ్య, వెంకటేష్, చింటూ భూమేష్, గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు. అలాగే రేచిని గ్రామంలో ఆదివాసీ కొలావార్ జెండా పండగను ఘనంగా నిర్వహించారు. భీమదేవరకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు దుర్గుబాయి, కుల పెద్దలు పాల్గొన్నారు.

కన్నెపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : కన్నెపల్లి మండల కేంద్రంలో ఆదివాసీ కొలా వార్ (మన్నెవార్) సంఘం నాయకులు జెండా పండుగను ఘనంగా నిర్వహించారు. భాజభజంత్రీలతో నృత్యాలు చేస్తూ జెండా వద్దకు వచ్చి భీమన్న, లక్ష్మీదేవరకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కుమరంబీం విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు కొడిపె వెంకటేష్, డీటీ జోగయ్య, తామాజీ ఉపసర్పంచు వెంకటేష్, రాములు, వెంకటేష్, నాగులు, డాగయ్య, భీమయ్య, చిలకయ్య, సురేష్ పాల్గొన్నారు.

వేమనపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చామనపల్లి గ్రామంలో ఆదివాసీ కొలావార్ జెండా పండుగను బుధవారం ఆదివాసీ కొలావార్ సేవా సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. జెండా ను ఎగురవేశారు. భీమదేవరకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పూజారులు చిన్న భీమయ్య, పర్వతాలు, కళాకారుడు మల్లయ్య, సంఘం నాయకులు మొండి , రాజన్న, కుల పెద్దలు చీకటి, రాజయ్య, రమేష్, అంజి, సాగర్, అరుణ్, స్వామి, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

నెన్నెల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివాసీ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. కోనంపేటలో మాజీ జడ్పీటీసీ కొడిపె భారతి జెండా ఎగుర వేసి గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మన్నెవార్‌లను కోలావర్లుగా గుర్తింపు ఇచ్చిన సందర్భంగా ఆదివాసీ దినోత్సవాన్ని ఏటా జరుపుకుంటామని గిరిజనులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, భీమయ్య, తదితరులు పాల్గొన్నారు.



తాండూర్‌లో జెండా ఎగురవేస్తున్న నాయకులు

ఇంటర్వ్యూ

22 అంగన్‌వాడీ భవనాలు మంజూరయ్యాయి



ఆంధ్రజ్యోతి: ప్రభుత్వం మండలానికి ఏమేమి మంజూరు చేసింది?

డీఈఈ: జైనూరు సబ్ డివిజన్ పరిధిలో22 అంగన్‌వాడీ భవనాలు మంజూరయ్యాయి. అవి పనులు నిర్మాణ దశలో ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: గత ప్రభుత్వం హయాంలో మంజూరైన పనులకు బిల్లులు వచ్చాయా?

డీఈఈ: నేను ఇక్కడికి కొత్తగా వచ్చాను. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో మంజూరైన పనుల వివరాలు, బిల్లుల వివరాలు తెలుసుకుంటాను.

ఆంధ్రజ్యోతి: డీఈఈగా మండలవాసులకు అందుబాటులో ఉండటం లేదనే విమర్శలున్నాయి. దీనిపై మీరేమంటారు

డీఈఈ: ప్రతిరోజు విధులకు హాజరవుతున్నాను. మండల ప్రజాప్రతినిధులకు, కాంట్రాక్టర్లకు అందుబాటులో ఉండి సేవలందిస్తాను. తరచుగా ఫీల్డ్ వర్క్‌లో ఉంటున్నాను.

◆ జైనూరు

అందని ఆయుర్వేద వైద్యం

- విధులకు హాజరుకాని డాక్టర్
- పట్టించుకోని అధికారులు

బెజ్జూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా ప్రజలకు వైద్యసేవలు అందించిన మండల కేంద్రంలోని ఆయుర్వేద ఆస్పత్రి ఇప్పుడు నిరుపయోగంగా మారింది. ఇక్కడ పనిచేసే డాక్టర్ విధులకు సక్రమంగా హాజరుకాకపోవడంతో గ్రామస్థులకు సరైన వైద్యసేవలు అందడం లేదు. ఆయుర్వేద ఆస్పత్రిలో పనిచేస్తున్న డాక్టర్ గతంలో డిప్యుటేషన్‌పై ఇతర జిల్లాకు వెళ్లింది. ఆ గడువు పూర్తి అయినా నేటికీ ఆమె విధుల్లోకి రావడం లేదు. దీంతో ఆయుర్వేద ఆస్పత్రికి వస్తున్న రోగులు డాక్టర్ లేక వెనుతిరిగి వెళ్లిపోతున్నారు. తరచూ సెలవుల పేరిట విధులకు ఎగనామం పెడుతుండటంతో ఇక్కడ సరైన ఆయుర్వేద వైద్యం అందడం లేదు.

● అధికారుల పర్యవేక్షణ కరువు..



బెజ్జూరులోని ఆయుర్వేద వైద్యశాల

మారుమూల గ్రామాల్లో ప్రజలకి ఇప్పటికీ ఆయుర్వేద వైద్యంపై నమ్మకం ఎక్కువ. ప్రస్తుతం ప్రజలు వివిధ రకాల దీర్ఘకాలిక వ్యాధులతో సతమతమవుతుండటంతో ఎక్కువగా ఆయుర్వేద వైద్యాన్ని నమ్ముకుంటారు. ఇక్కడ పనిచేసిన డాక్టర్ గతంలో కొత్తగా వచ్చిన సమయంలో కొద్ది రోజులు విధులకు సక్రమంగానే హాజరవుతుండేదని, మెటర్నిటీ సెలవులో వెళ్లినప్పటి నుంచి పూర్తిగా విధులకు హాజరు కావడం లేదని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఆ తర్వాత డిప్యుటేషన్‌పై సూర్యాపేటకు వెళ్లగా, ప్రభుత్వం డిప్యుటేషన్లు రద్దు చేయడంతో తిరిగి విధుల్లోకి చేరిన రోజే లాంగ్‌లీవ్ పెట్టినట్లు తెలుస్తోంది. దీంతో గ్రామాల్లో వైద్యసేవలు అందక ప్రైవేటులో వైద్యసేవలు పొందుతున్నారు. అధికారులు సైతం ఈ విషయంపై పట్టింపులేనితనంగా వ్యవహరిస్తున్నారనేది మండలవాసులు ఆరోపణ. రెండేళ్ల నుంచి ఇక్కడ వైద్యసేవలు అందకపోవడంతో దీర్ఘకాలిక రోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డాక్టర్ రెగ్యులర్‌గా విధులకు హాజర య్యేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అందుబాటులో ఉండే వైద్యుడిని నియమిస్తాం..

- ప్రేమలాదేవి, ఆర్‌డీడీ, వరంగల్

బెజ్జూరులోని ఆయుర్వేద డాక్టర్ కొంతకాలంగా సెలవుపై ఉంది. త్వరలోనే అందుబాటులో ఉండే మరో డాక్టర్‌ను నియమించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం ఉన్న డాక్టర్ తరచూ సెలవుపై ఎందుకు వెళ్తుందో తెలుసుకుంటాం. స్థానికంగా వైద్యసేవలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.

మెనూ పాటించాలి

కెరమెరి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలని జడ్పీ సీఈవో లక్ష్మినారాయణ అన్నారు. బుధవారం ఆయన ఇందాపూర్ ఎంపీపీఎస్ పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్నభోజనంలో మెనూ పాటించాలని నాణ్యమైన భోజనం అందించాలన్నారు.

అమ్మాయిలను వేధిస్తే కఠిన చర్యలు

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మండలం గుండి ఎంపీయూఎస్ పాఠశాలలో షీటీం సభ్యులు ఈవ్‌టీజింగ్, సైబర్ క్రైంలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. షీటీం ఇన్‌చార్జి సునీత మాట్లాడుతూ విద్యార్థినులు, మహిళలు, హింస, ఈవ్‌టీంగ్, సైబర్‌క్రైంలకు ఎవరైనా గురైతే వెంటనే షీటీంలను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కవిత, ఉపాధ్యాయులు, షీ టీం సభ్యులు స్వప్న, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



కాగజ్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

చట్టాలపై అవగాహన..

కాగజ్‌నగర్: మహిళలకు చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని షీటీం ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని గన్నారం రెసిడెన్షియల్‌కాలేజీలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై తిరుమల మాట్లాడుతూ మహిళలపై హింస, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే వెంటనే సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో షీటీం సిబ్బంది పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు పండ్లు పంపిణీ

ఆసిఫాబాద్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూర్గుడ ప్రభుత్వ ఉన్నతపాఠశాలలోని పదోతరగతి విద్యార్థులకు బుధవారం కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో పండ్లు, స్నాక్స్ పంపిణీ చేశారు. ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న పదో తరగతి విద్యార్థులకు పార్టీ జిల్లా అధ్యక్షులు విశ్వప్రసాద్‌రావు ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పండ్లు, స్నాక్స్ పంపిణీ చేపపడుతున్నట్లు వారు పెర్కొన్నారు. కార్యక్రమంలో మాజీఎంపీపీ బాలేశ్వర్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు మసాదే చరణ్, ఎంఈవో సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

కొలావార్లు అన్నిరంగాల్లో ఎదగాలి

చింతలమానేపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ (మన్నెవార్) కొలావార్లు అన్నిరంగాల్లో ఎదగాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుర్మపోశం అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆత్మగౌరవ దినోత్సవం, భీమదేవర జెండా పండుగ ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బాపు, శంకర్, ప్రసాద్, రూపేష్, ఫణీందర్, భీమయ్య, సురేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



చింతలమానేపల్లిలో జెండాను ఆవిష్కరిస్తున్న ఆదివాసీ నాయకులు

కాగజ్‌నగర్/దహెగాం/బెజ్జూరు/పెంచికలపేట/కౌటాల/రెబ్బెన: మండలాల్లోని గ్రామాల్లో బుధవారం ఆదివాసీ కొలావార్ సంఘాల ఆధ్వర్యంలో భీమన్న దేవర జెండా పండుగను ఘనంగా నిర్వహించారు. ప్రజలందరూ డప్పు వాయిద్యాలతో గిరిజన సంప్రదాయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి జెండాను ఆవిష్కరించారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

● సీఐ రవిందర్

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సీఐ రవిందర్ అన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలురు గురుకుల పాఠశాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. వాహన దారులు తప్పనిసరిగా సీటు బెల్టు, హెల్మెట్ ధరించాలన్నారు. విద్యార్థులు రోడ్డుభద్రత నియమాలపై తల్లిదండ్రులకు, గ్రామస్థులకు అవగాహన కల్పించా లన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యాదగిరి, వైస్‌ప్రిన్సిపాల్ అబ్దుల్ రహీం, ఉపాధ్యాయులు శంకర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ..

దహెగాం: మండలంలోని లగ్గాం-పెంచికలపేట క్రాస్ రోడ్డు వద్ద ఎస్సై రాజు వాహనాల తనిఖీ చేపట్టారు. ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి వాహన డ్రైవర్లకు జరిమానా విధించారు.

హెల్మెంట్ ధరించాలి

పెంచికలపేట: ద్విచక్రవాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై కొమురయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆటో డ్రైవర్లకు, ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు.

11న జరిగే ధర్నాను విజయవంతం చేయండి

శ్రీరాంపూర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులసమస్యలు పరిష్కరించాలని ఈనెల 11నశ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్‌వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, బ్రాంచ్‌అధ్యక్షుడు దొడ్డి పట్టరవీందర్ కోరారు. శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో బుధవారం జరిగిన గేట్‌మీటింగ్‌కు వారు ముఖ్య అతథిగా హాజరై మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ వేతనాలు ఇవ్వాలని, 2022 సెప్టెంబర్‌లో జరిగిన ఒప్పందాన్ని అమలు చేయాలని, ప్రతి నెల 7వ తేదీన కార్మికులకు వేతనాలివ్వాలని, తదితర డిమాండ్లతో ధర్నాచేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కాంట్రాక్ట్ కార్మికులు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పిట్ కార్యదర్శి తిరుపతి, నాయకులు వీరేశం, సత్యనారాయణ పాల్గొన్నారు.

వైరస్ రాకుండా జాగ్రత్తలు పాటించాలి

శ్రీరాంపూర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): హ్యూమన్ మెటా న్యూమోవైరస్ (హెచ్‌ఎంపీవీ) వైరస్ రాకుండా జాగ్రత్తలు పాటించాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎల్‌వి సూర్య నారాయణ అన్నారు. ఆర్కే8 డిస్పెన్సరీలో పలు జాగ్రత్తలతో కూడిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలని, వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

వైద్యాధికారి డాక్టర్ లోక్‌నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో సింగరేణి ఉన్నతపాఠశాల విద్యార్థులకు వైరస్‌పై అవగాహన కల్పించారు. కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం ఎన్ సత్యనారాయణ, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా పాల్గొన్నారు.



సింగరేణికి స్పెషల్ క్యాంపెయిన్ 4.0 పురస్కారం ప్రదానం

శ్రీరాంపూర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రారంభిం చిన స్పెషల్ క్యాంపెయిన్ 4.0లో భాగంగా ఎక్కువ ప్రాంతాలను శుభ్రంచేసిన విభాగంలో సింగరేణికాలరీస్‌కు జాతీయస్థాయిలో అవార్డు లభించింది. బొగ్గుమంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో చింతన్‌శివిర్‌లో భాగంగా మంగళవారం రాత్రి కేంద్రమంత్రి జి కిషన్‌రెడ్డి నుంచి సింగరేణి సీఎండీ ఎన్ బలరాం అవార్డును అందుకున్నారు. అక్టోబర్2 నుంచి 31 వరకు స్పెషల్ క్యాంపెయిన్ 4.0పేరిట సింగరేణిలో స్వచ్ఛతాకార్యక్రమాలు నిర్వహించారు. 11ఏరియాల్లో 157చోట్ల పరిసరాలను పరిశుభ్రం చేయాలని భావించగా, 216ప్రదేశాల్లో శుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. దీంతో అవార్డు అందించారు. ఈసందర్భంగా సింగరేణి సీఎండీ ఎన్ బలరాం మాట్లాడుతూ, దేశఇంధన అవస రాలకు బొగ్గు ఎంత అవసరమో భారతావనికి పరిశుభ్రత కూడా అంతే అవసరమని తెలిపారు. అందుకే సంస్థలో పరిశుభ్రతకు పెద్దపీట వేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బొగ్గుశాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్‌దత్, అదనపు కార్యదర్శులు రూపేందర్ బ్రార్, విస్మితాతేజ్, సింగరేణి జీఎం బి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



అవార్డు స్వీకరిస్తున్న సీఎండీ

క్లరికల్ సిబ్బంది సమస్యలు పరిష్కరిస్తాం

శ్రీరాంపూర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్‌లోని ఆర్కే7, న్యూటెక్, ఎస్‌ఆర్‌పీ1,3 గనులకుచెందిన ఏఐటీయూసీ క్లరికల్ సబ్‌కమిటీ సమావేశం బుధవారం జరిగింది. క్లర్కులకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర 8మెన్ కమిటీ, 11మెన్ కమిటీల ద్వారా క్లర్కుల హక్కులు, క్యాడర్‌స్కీం, పదోన్నతులు పాలసీ, ఇతర సదుపాయాలను సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. ఆర్కే7గని పిట్‌కార్యదర్శిగా రాంచందర్, సహాయ పిట్ కార్యదర్శిగా గాదె నవీన్, ఆర్‌కే న్యూటెక్ గని పిట్ కార్యదర్శిగా తిరుపతయ్య, సహాయ పిట్ కార్యదర్శిగా సారంగపాణి, ఎస్‌ఆర్‌పీ 1 గని పిట్ కార్యదర్శిగా అశోక్ కుమార్, సహాయ పిట్ కార్యదర్శిగా క్రాంతి కుమార్, ఎస్‌ఆర్‌పీ 3 గని పిట్ కార్యదర్శిగా కూర్మెళ్ల లక్ష్మణ్, సహాయ పిట్ కార్యదర్శిగా సౌందర్యను నియమించారు. ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ ఉప ప్రధానకార్యదర్శి ముష్కె సమ్మయ్య, జీఎం చర్చల కమిటీ ప్రతినిధి బద్రి బుచ్చయ్య, సీహెచ్‌పీ క్లరికల్ పిట్ కార్యదర్శి జిల్లాల రవి హాజరయ్యారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

జైపూర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): జైపూర్ పవర్‌ప్లాంటు కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బుధవారం సింగరేణి డైరెక్టర్ పా విశ్వేశ్వర్‌రెడ్డికి బీఎంఎస్ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, బీఎంఎస్ ఎస్టీపీపీ పవర్‌ప్లాంట్ ప్రధాన కార్యదర్శి దుస్స భాస్కర్ మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు క్యాంటీన్‌సౌకర్యం ప్రారంభించి సబ్సిడీపై కొనసాగించాలన్నారు. భూనిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించిన పవర్‌ప్లాంట్ యాజమాన్యం చదువుకు తగిన ఉద్యోగం, కార్మికులకు పదోన్నతులు కల్పించాలని తదితర సమసస్యలను విన్నవించారు. పవర్ ప్లాంట్ యాజమాన్యంతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని డైరెక్టర్ తెలిపినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు బోడకుంట శ్రీదర్, శివకృష్ణ, చిలకాని వెంకేటష్, సతీష్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సింగరేణిలోపనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు డి బ్రహ్మానందం, రాష్ట్ర కార్యదర్శి ఎ వెంకన్న అన్నారు. వారి ఆధ్వర్యంలో బుధవారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఇతర ప్రభుత్వ సంస్థల్లో అమలు చేస్తున్నట్లు కాంట్రాక్టు కార్మికులకు పండుగ సెలవులు, సాధారణ సెలవులు, ఉచిత వైద్య సౌకర్యం, అలవెన్సులు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు తాళ్లపెల్లి శ్రీనివాస్, అరుణోదయ రాష్ట్ర నాయకులు మంతెన మల్లన్న, శేఖర్, పాల్గొన్నారు.

సొంతింటి పథకం తప్పక అమలు చేయాలి

శ్రీరాంపూర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఉద్యోగులకు సొంతింటి పథకం తప్పక అమలుచేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్రఅధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. ఆర్‌కే న్యూటెక్‌గనితోపాటు నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణికి కావాల్సినంత స్థలం ఉందని, ఇండ్లు ఇస్తే ఎవరికీ నష్టం లేదన్నారు. సంస్థకు నిర్వహణ ఖర్చులు మిగులుతాయని, ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని తెలిపారు. కార్మికులకు సైతం ఆర్థికంగా లాభం జరుగుతుందన్నారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరహరిరావు, బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, అంబాలశ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనంతో అందరి కలయిక

మందమర్రిటౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆత్మీయ సమ్మేళనం అందరినీ కలిసేలా చేసిందని కేకే5 గనిమేనేజర్ ప్రవీణ్ అన్నారు. బుధవారం ఏరియాలోని కేకే5గని వద్ద ఏ-రిలే ట్రామర్ల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈసమ్మేళన ఆలోచనచేసిన మున్ని ప్రదీప్‌ను అభినందించారు. రిటైర్డు ఉద్యోగి మున్ని లింగయ్య మాట్లాడుతూ సింగరేణిలో ఇది ఒక చరిత్ర అన్నారు. తమను కూడా పిలిచి సన్మానించడం అంటే తాము పనిచేసిన రోజులు గుర్తుకు వచ్చాయన్నారు. అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా ట్రామర్లు, గనిమేనేజర్‌తో పాటు రక్షణాధికారి రమేష్, అసిస్టెంట్ మేనేజర్ జశ్వంత్ సన్మానించారు.

కైరిగూడ మైన్‌ను సందర్శించిన ఏఐటీయూసీ నాయకులు

రెబ్బెన, జనవరి 8(ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియా కైరిగూడ మైన్‌ను బుధవారం ఏఐటీయూసీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్యమొగిలి తదితరులు బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదక అధిగమించేందుకు బర్డెన్ మట్టిని తీయటాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పిట్‌కార్యదర్శి మారం శ్రీనివాస్, కిరణ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

నేడు శిక్షకుల ఎంపిక కోసం ఇంటర్వ్యూలు

రెబ్బెన, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత వృత్తివిద్యా కోర్సుల శిక్షకుల ఎంపిక కోసం గురువారం జీఎం కార్యాయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు అధికార ప్రతినిధి రెడ్డిమల్ల తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు.

యోగా, డీటీపీ, బ్యూటీషియన్, ఫ్యాషన్ డైజైనింగ్ తదితర కోర్సులు బోధించేందుకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు ఉదయం 11 గంటలకు సంబంధిత సర్టిఫికేట్లతో హాజరు కావాలని కోరారు.

రెండు తలల పాము కేసులో నిందితుల అరెస్టు

- వివరాలు వెల్లడించిన ఎఫ్‌ఆర్‌వో శివకుమార్



మాట్లాడుతున్న ఎఫ్‌ఆర్‌వో శివకుమార్

చెన్నూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర ప్రాంతం నుంచి తెలంగాణ ప్రాంతానికి తరలిస్తున్న రెండు తలల పాము కేసులో ఏడుగురు ముఠా సభ్యులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చినట్లు చెన్నూరు అటవీ రేంజ్ అధికారి శివకుమార్ తెలిపారు. బుధవారం అటవీ శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ఆయన వెల్లడించారు. చెన్నూరు, కోటపల్లి మండలాలకు చెందిన సదార్ల ధనుంజ్, కొరాళ్ల సంతోష్, దుర్గం రాజగోపాల్, వేములపల్లి తిరుపతి, కుంబం పోచిరెడ్డి, మహారాష్ట్రకు చెందిన సుదర్శన్, ప్రభాకర్‌లు ఒక ముఠాగా ఏర్పడి మహారాష్ట్ర నుంచి రెండు తలల పామును తెలంగాణకు తరలిస్తున్నారనే పక్కా సమాచారంమేరకు చెన్నూరు మండలం చింతలపల్లి జాతీయ రహదారి 63పై మాటు వేసి రెండు తలల పామును కారులో తరలిస్తున్న ముఠా సభ్యులను ఆపి కారులో తనిఖీ చేయగా కారులో రెండు తలల పాము లభ్యమైందని చెప్పారు. ఈ విషయంపై అటవీ శాఖ ఉన్నతాధికారులకు సమాచారం అందించగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ కొనసాగించగా ఈ ఏడుగురు ముఠా సభ్యులు మహారాష్ట్రలో రెండు తలల పాము ను సేకరించి తెలంగాణ ప్రాంతానికి తరలిస్తున్నట్లు తెలిపారన్నారు. రెండు తలల పాముతో పాటు కారు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మూఢనమ్మకాలతో ఇలాంటి చర్యలకు పాల్పడి వన్య ప్రాణులకు హానికలిగిస్తే వైల్డ్‌లైఫ్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. యు/ఎస్ 9, ఆర్/డబ్ల్యూ2 (16), 39(3), ఆర్/డబ్ల్యూ57, 48-ఏ, 49-బీ, 51 వైల్డ్‌లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్ 1972 కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సమావేశంలో డిప్యూటి రేంజ్ అధికారి ప్రభాకర్, ఫారెస్టు సెక్షన్ అధికారులు చంద్రమౌళి, రాజేష్, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

బంగారు మైసమ్మ ఆలయంలో చోరీ

బెల్లంపల్లి, జవవరి 8(ఆంధ్రజ్యోతి) : కన్నాల జాతీయ రహదారి పక్కన ఉన్న బంగారు మైసమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం తలుపులు పగలగొట్టి లోపల ఉన్న బీరువా నుంచి 15 తులాల వెండి, పావు తులం బంగారపు ముక్కు పుడకను ఎత్తుకెళ్లారు. ఆలయ అర్చకులు బుధవారం ఆలయం వద్దకు వెళ్లగా తలుపులు పగులగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, ఎస్సై రమేశ్ చేరుకొని పరిశీలించి క్లూస్ టీంకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కొత్తపల్లిలో తాటిచెట్లకు నిప్పు

తాండూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తాండూర్ మండలంలోని కొత్తపల్లి పంచాయతీ పరిధిలో బుధవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు తాటి చెట్లకు నిప్పు పెట్టారు. దీంతో చెట్లు కాలిపోయాయి. చెట్లకు నిప్పుపెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని మోకుదెబ్బ మండల కమిటీ నాయకులు కోరారు.

ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య

వేమనపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జక్కెపల్లి గ్రామానికి చెందిన పొరిశెట్టి మహేష్(30) అనే యువకుడు బుధవారం తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహేష్ వ్యవసాయ పనులు చేసేవాడు. రెండు సంవత్సరాలుగా మద్యానికి బానిసయ్యాడు. మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్నాడు. మతిస్థిమితం లేని కారణంగా ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకున్నాడు.

రేషన్ బియ్యం సీజ్

భీమారం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): భీమారం మండలంలోని ఆరేపల్లి గ్రామం లోని రేషన్ షాపులో సుమారు 12 క్వింటాళ్ల రేషన్ బియ్యం అధికారులు సీజ్ చేశారు. రేషన్ బియ్యాన్ని గన్ని సంచుల నుంచి వేరు చేసి ప్లాస్టిక్ సంచుల్లో ప్యాక్‌చేసి తరలించేందుకు సిద్ధంగా ఉంచడాన్ని గమనించిన గ్రామస్థులు డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించారు. భీమారం పోలీసులు బియ్యం, బియ్యం తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఆటోను సీజ్ చేశారు. ఈ విషయాన్ని పౌరసరఫరాల శాఖ డీటీ స్రవంతికి సమాచారం అందించడంతో ఆరేపల్లి గ్రామంలోని రేషన్ షాపును పరిశీలించారు. రేషన్ షాపు ఓనర్ స్వర్ణలతపై 6ఏ కింద కేసు నమోదు చేశారు. ఆరేపల్లి గ్రామానికి చెందిన రేషన్ షాపును పోలంపల్లి షాపు యాజమానికి అప్పగిస్తామని తెలిపారు. అక్రమంగా రేషన్ బియ్యం తరలించేందుకు షాపు యజ మాని బంధువులు ఉన్నారని, పోలీసులను చూసి పరారయ్యారని ప్రజలు తెలిపారు.

108లో ప్రసవం

కాసిపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలం లోని సోనాపూర్ నాయకపు గూడకు చెందిన కనక మౌనిక బుధవారం 108 అంబులెన్స్‌లో ప్రసవించింది. మౌనికకు పురుటి నొప్పులు రావడంతో కుటుంబీకులు 108కు సమా చారం అందించారు. నొప్పు లు ఎక్కువ కావడంతో ఈఎంటీ ఆత్మారాం ఈఆ ర్‌సీపీ వైద్యుని సలహా మేరకు అంబులెన్స్‌లో ప్రవసం చేయగా ఆడపి ల్లకు జన్మినిచ్చింది. తల్లిబిడ్డ ఆరోగ్యంగా ఉండడంతో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఈ సందర్భంగా ఈఎంటీ ఆత్మారాం, పైలెట్ ఎండీ అసద్ పాషాకు మౌనిక కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు కరాటే నేర్చుకోవాలి

లక్సెట్టిపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కరాటే తప్పని సరిగా నేర్చుకోవాలని డ్రాగన్‌స్కార్డ్ కుంగ్‌ఫూ కరాటే అకాడమీ గ్రాండ్ మాస్టర్ రాజమల్లు అన్నారు. పట్టణంలోని గురునానక్ గార్డెన్స్‌లో బుధవారం కరాటే, కుంగ్‌ఫూలో ప్రతిభ చాటిన విద్యార్థులకు బెల్టుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. అమ్మాయిలు తప్పనిసరిగా నేర్చుకోవాలని సూచించారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

లక్సెట్టిపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సామాజిక సేవలు చేసి జాతీయ స్థాయి అవార్డును పొందిన పట్టణ వాసి తగరపు సత్తయ్యను ప్రభుత్వ సాంస్కృతిక క్రీడల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. హైదరాబాద్ లోని యువజన క్రీడల సర్వీసు శాఖ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో సత్తయ్యను యువజన సాంస్కృతిక క్రీడల సర్వీస్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సబిత సబర్వాల్‌తో పాటు యువజన సర్వీసుల శాఖ డైరెక్టర్ వెంకటేశ్వర్లు సన్మానించి జ్ఞాపికను అందజేసారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గర్మిళ్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాలలోని ఏసీసీ సబ్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో గురువారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ వేణుగోపాల్, ఏఈ శ్రావణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్కెట్ ఏరియా, ఇక్బాల్‌నగర్, ఇందిరనగర్, జాఫర్ నగర్,జన్మభూమి నగర్, హైటెక్ సిటీ, గ్రీన్ సిటీ, ఏసీసీ, శ్రీనివాస్‌గార్డెన్, సావిత్రినగర్, వికాస్‌నగర్, గౌతమి నగర్, ఇస్లాంపుర, ఆండాలమ్మ కాలనీ, రాళ్లపేట, డీసీపీ ఆఫీస్ ఏరియాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.

వంతెన పూర్తయ్యేదెన్నడు..?

5వ పేజీ తరువాయి..

పేరుతో మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లో ప్రత్యేకంగా కమిటీలు కూడా ఏర్పాటయ్యాయి. మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాష్‌రావు కూడా వంతెన నిర్మాణానికి ప్రత్యేక చొరవ చూపారు. వంతెన నిర్మాణం ఆవశ్యకతపై పలు మార్లు ఆయన ముఖ్యమంత్రికి లేఖలు సైతం రాశారు. జిల్లా కేంద్రంలో గోదావరి వంతెన సాధ న సమితి ఆధ్వర్యంలో దీక్షలు చేపట్టారు. ఆందోళ నలు ఉధృతం అవుతున్న తరుణంలో ఎట్టకేలకు వంతెనను అప్పటి ప్రభుత్వం మంజూరు చేసింది.

● స్థల మార్పిడి యోచనలో..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వంతెన నిర్మాణం కొనసాగుతుందా అనే సంశయంలో రెండు జిల్లాల ప్రజలు ఉన్నారు. గోదావరి పై రెండు జిల్లాల నడుమ వంతెన నిర్మాణం ప్రజల చిరకాల కోరిక కావడంతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలనే విజ్ఞప్తులు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో వంతెన కోసం గతంలో ప్రతిపాదించిన స్థలం కాకుండా మరో చోటికి మార్పు చేయనున్నారనే ప్రచారం ఊపం దుకుంది. ముందుగా ప్రతిపాదించనట్లు జిల్లా కేంద్రంలోని కాలేజ్‌రోడ్డు గౌతమేశ్వరాలయం వద్ద కాకుండా, హాజీపూర్ మండలం ముల్కల్ల వద్ద గోదావరిపై వంతెన నిర్మాణానికి ఏర్పాట్లు జరుగుతున్నట్లు తెలుస్తోంది. కాలేజ్‌రోడ్డులో గౌతమేశ్వరాలయం వద్ద వంతెన నిర్మిస్తే పట్టణంలో విపరీతమైన ట్రాఫిక్ పెరిగి ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉన్నందున ముల్కల్ల వద్ద నిర్మాణం చేపట్టాలనే యోచనలో ఉన్నట్లు సమాచారం. శుభకార్యాలు, కర్మకాండల కోసం పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో గోదావరి స్నానాలపై ఆధారపడ తారు. ముఖ్యంగా పండుగలు, పర్వదినాల్లో కాలేజి రోడ్డులో విపరీ తమైన జన సంచారం ఉంటుంది. అక్కడ బ్రిడ్జి నిర్మిస్తే మరింతగా జనం, వాహనాల సంచారం పెరిగి ఇబ్బందులు తప్పవనే భావనతో స్థలం మార్చాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలు స్తోంది. ఒకవేళ ముల్కల్ల వద్ద గోదావరిపై వంతెన నిర్మాణం చేపడితే పనులు మళ్లీ మొదటి నుంచి ప్రారంభించాల్సి వస్తుండగా, పనులు మరింత ఆల స్యమయ్యే అవకాశాలు ఉన్నాయి. వంతెన పనులు వేగంగా పూర్తి చేసేందుకు ప్రజాప్రతినిధులు, చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మహిళల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మహిళల సంక్షేమం, ఆర్థిక సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటున్నదని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అదనపు కలెక్టర్, అధికారులతో సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ఇందిరా మహిల శక్తి పథకం ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధి కొరకు వ్యాపార అంశాల్లో మహిళలను ప్రోత్సహిస్తూ రుణ సదుపాయాలు కల్పించి రాయితీ అవకాశం ఇవ్వడం జరుగుతుందన్నారు. మహిళ స్వయం సహాయక సంఘాల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి వెయ్యిమెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు భవిష్యత్ కార్యచరణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఐదు సంవత్సరాల్లో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చాలనే ఉద్దేశ్యంతో ప్రభతత్వం ముందడుగు వేస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు కోసం జిల్లాలో 10 ఎకరాల భూమిని గుర్తించామని తెలిపారు. మిగత భూమిని త్వరలోనే సేకరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి శివ్‌ఆశిష్‌సింగ్, అదనపు కలెక్టర్ మోతిలాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్లాంకెట్లు పంపిణీ

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణంలోని చున్నంబట్టివాడలోని వెనకబడిన తరగతుల సంక్షేమ బాలుర వసతి గృహంలోని విద్యార్థులకు బుధవారం జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ 144 బ్లాంకెట్లను పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ నూతన సంవత్సరం సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు అందించిన బ్లాంకెట్లను విద్యార్థులకు అందించామని తెలిపారు. కార్యక్రమంలో వెనకడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తంనాయక్ పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

మందమర్రిటౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీఈఆర్ క్లబ్‌లో బుధవారం లాటరీ పద్ధతి ద్వారా డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేశారు. మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్‌రావు సమక్షంలో ఎంపిక చేశారు. 243 మంది లబ్ధిదారులను లాటరీ ద్వారా ఎంపిక చేశారు. స్థానిక పాలచెట్టు సమీపంలో 565 గృహాలు నిర్మించారు. వీటిలో 243 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఎలాంటి గొడవలు జరగకుండా సీఐ శశిధర్‌రెడ్డి పోలీసులతో బందోబస్తు నిర్వహించారు. ఎవరికైనా అనుమానాలు ఉంటే ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఇంటింటికి సర్వే చేయకుండా లాటరీ ద్వారా ఎలా ఎంపిక చేస్తారని పలువురు మండిపడ్డారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంతోష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

- హోంఫుడ్స్ వ్యాపారంలో రాణిస్తున్న సాహితి
- ఆన్‌లైన్ ద్వారా ఆర్డర్లు.. విదేశాలకు ఎగుమతులు
- ఫ్లేవర్స్ ఆఫ్ తెలుగు పేరిట ఇన్‌స్టాగ్రామ్‌లో పేజీ
- 2.9 లక్షల మంది ఫాలోవర్లు



పిండి వంటలు చేస్తున్న మహిళలు



సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలి పిండివంటల తయారీ

నెన్నెల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలిపెట్టి పండి వంటలు, పచ్చళ్ల తయారీ వ్యాపారం ప్రారంభించి ఇప్పుడు ఇతర దేశాలకూ ఎగుమతి చేస్తున్న యువతే నెన్నెలకు చెందిన 25 ఏళ్ల సాహితి. లక్షల్లో జీతం కలిగిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలేసి వంటలు చేసే తన అభిరుచిని వ్యాపారంగా మార్చుకున్నారు. మారు మూల గ్రామం నుంచి టేస్టీ ఫుడ్ ప్రొడక్ట్స్‌ను దేశ విదేశాలకు ఎగుమతి చేస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు.



● లాక్‌డౌన్ సమయంలో..

బీటెక్ చదివిన సాహితి హైదరాబాదు టీసీఎస్‌లో రూ. 9 లక్షల ప్యాకేజీతో సాఫ్ట్‌వేర్ జాబ్ చేసేది. లాక్‌డౌన్ సమయంలో వర్క్‌ఫ్రం హోం చేయాల్సి రావడంతో స్వగ్రామానికి వచ్చేసింది. ఆఫీస్ వర్క్ చేస్తూనే ఖాళీ సమయంలో తల్లి చేసే పచ్చళ్లు, ఇంటి వంటలను సరదా గా రీల్స్ చేసి అప్‌లోడ్ చేసేది. వాటికి బోలెడు లైకులు, కామెంట్లు వచ్చేవి. వంటలు బాగా చేస్తున్నారు. మా కోసం చేసి పంపిస్తే మేము టేస్ట్ చేస్తాం కదా.. అనే ఓ ఫాలోవర్ కోరిక మేరకు కొన్ని పచ్చళ్లు, స్వీట్లు తయారు చేసి మొదటి సారి వారికి పంపించారు. చాలా బావున్నాయని, మరిన్ని కావాలని చెప్పారు. దీంతో సంప్రదాయ వంటలకు ఉన్న డిమాండ్ అర్థమైంది. దాన్నే ఉపాధిగా మార్చుకోవాలని భావించి తన హోంఫుడ్స్ ప్రస్థానాన్ని ప్రారంభించింది. అనతి కాలంలోనే దేశ విదేశాలకు తన పచ్చళ్లు, వంటల రుచులు పంచే స్థాయికి ఎదిగింది. జాబ్ వది లేసి పూర్తి సమయాన్ని వ్యాపారానికే కేటాయిస్తోంది. ఫుడ్ లైసెన్స్ తీసుకొని తన సొంత ఇంటిని ఓ కంపెనీగా మార్చి మరో 15 మంది పనివాళ్లను నియమించుకున్నారు. ఫ్లేవర్స్ ఆఫ్ తెలుగు పేరిట ఇన్‌స్టాగ్రామ్‌లో పేజీ క్రియేట్ చేసి తన వీడియోలను అందులో పోస్టు చేస్తోంది. వెయ్యి వీడియోల వరకు పోస్టు చేసిన ఆ పేజీకి 2.9 లక్షల మంది ఫాలోవర్లు ఉన్నారు.

● తెలుగు ఫ్లేవర్స్ ఇవే..

మామిడి (ఊరగాయ), బెల్లం ఆవకాయ, అల్లం ఆవకాయ, నువ్వుల ఆవకాయ (ఉప్పు తొక్కు),ఉసిరి, కాకరకాయ, వెల్లుల్లి, అల్లం తొక్కు, గోంగూర, పచ్చిమిర్చి చింతకాయ తొక్కు, నిమ్మ, పండు మిర్చి, ఎండు మిర్చి, రేగిపళ్లు, టమాట తదితర పచ్చళ్లు ఉన్నాయి.

● పొడులు..

కొత్తిమీర పొడి, కరివేపాకు, ఫ్లాక్స్ సీడ్ పొడి, కంది పొడి, పప్పు పొడి, పెసర పొడులు ఉన్నాయి. అలాగే గొంగూర బిర్యాణి మిక్స్, గోంగూర పులిహోర మిక్స్, మామిడి తురుము, మామిడి పులిహోర, మిల్లెట్ ఉప్మా, పొంగల్ మిక్స్, టమాట మిక్స్‌లు ఉన్నాయి.

- కాకరకాయ కారం, కొబ్బరి కారం, మునుగాకు కారం, నల్లకారం, నువ్వుల కారం, పల్లి కారం, వెల్లుల్లి కారం ఉన్నాయి
- బిర్యాణి మసాల, గరం మసాల, కొత్తిమీర పౌడర్, అల్లం వెల్లుల్లి పేస్ట్, మిర్చి పౌడర్ (కారం), పసుపు, రసం పౌడర్, సాంబార్ పౌడర్ ఉన్నాయి.
- చకినాలు, చెగోడీలు, చెక్కలు, గవ్వలు, స్పైసీ బోందీ, గులాబీపూలు, జొన్నకారం పూసా, కాజు చిక్కి, పల్లిచిక్కి, కారప్పూసా, కొబ్బరి కరిజెలు, కొర్ర చెక్కలు, తదితర రకాలు విక్రయిస్తున్నారు.

మొదట నిరుత్సాహ పరిచారు..
- చిలువేరు సాహితి

టెకీ జాబ్ వదిలేసి పచ్చళ్ల వ్యాపారం చేయడం ఏంటని చాలా మం ది నిరుత్సాహ పరిచారు. వారందరికీ రిజల్ట్స్‌తో సమాధానం చెప్పాను. అలాంటి వాళ్లే ఇప్పుడు నా సక్సెస్‌ను చూసి మెచ్చుకుంటున్నారు. సంప్రదాయ వంటల బిజినెస్‌లో ఫ్లేవర్ ఆఫ్ తెలుగు బ్రాండ్‌కు మంచి ఇమేజ్ ఉంది. . ఆర్డర్ వచ్చిన తరువాతనే తయారు చే స్తాం, వెంటనే షిప్పింగ్ చేస్తాం కాబట్టి ఫ్రెష్‌నెస్ ఉంటుంది. మంచిర్యాల కేంద్రంగా పెద్ద కంపెనీ పెట్టాలనే ఆలోచన ఉంది.



పచ్చడి ప్యాకింగ్ చేస్తున్న మహిళలు

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఆటోలకు రోడ్డు భద్రత స్టిక్కర్లు వేస్తున్న సిబ్బంది

మందమర్రి టౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి) : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మంచిర్యాల ఎంవీఐ ఖాసింసాహేబ్ అన్నారు. బుధవా రం పట్టణంలోని రాష్ట్రీయ రహదారి బెల్లంపల్లి, మంచిర్యాల, మంద మర్రి, గోదావరిఖని నాలుగు రోడ్ల కూడలి జయశంకర్ చౌరస్తా వద్ద రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవర్లను ఉద్దేశించి మా ట్లాడారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ మాట్లాడడం, పరిమితికి మంచి ప్రయాణికులను ఎక్కిం చుకోవడం సరికాదని చెప్పారు. నిర్లక్ష్యాల వల్లనే ప్రమాదాలు జరుగుతాయని తెలుసుకోవాలన్నారు. మితిమీరిన వేగంగా కూడా ప్రమాదాలకు తావిస్తుందని చెప్పారు. అనంతరం ఆటో డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆటోలు, బస్సులకు రోడ్డు శద్రత స్టిక్కర్లను అంటించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సూర్యతేజ, ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకులు మొయ్య రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

హాజీపూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని గుడి పేట, హాజీపూర్ గ్రామాల్లో బుధవారం రోడ్డు భద్రత నియమాలపై తెలంగాణ సంస్కృతిక సారధి కళా కారులు అవగాహన కల్పించారు. ద్విచక్రవాహన దా రులు హెల్మెట్ ధరించాలని, సూచించారు. కార్యక్రమంలో రవీందర్, శ్రీనివాస్, మురళి నిరోష, రవికుమార్, పోశం తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కేంద్రం తీసుకువచ్చిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయాలని కోరుతూ బుధవారం ఏఐకేఎంఎస్ నాయకులు మంచిర్యాలోని బస్టాండ్ ఎదుట కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి లాల్‌కుమార్ మాట్లాడుతూ మూడు నల్లా చట్టాలను రద్దు చేయాలని ఎస్‌కేఎంజాతీయ నాయకుడు జగత్‌సింగ్ దలైవాల్ ఆమరణ దీక్ష చేస్తున్నారని అన్నారు. ఆయనకు మద్దతు తెలుపుతూ నిరసన కార్యక్రమాలు చేపడుతు న్నామని తెలిపారు. కేంద్రం కార్పోరేట్ శక్తులకు అనుకూలంగా మారి ప్రజలు, రైతులను ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. వెంటనే నల్ల చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, శ్రీనివాస్, మల్లన్న, అరుణ, సురేందర్, గణేష్, మహేష్ పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన



సంఘమల్లయ్యపల్లెలో మాట్లాడుతున్న ఎస్సై సుగుణాకర్

బెల్లంపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సెయింట్‌మేరీస్ ఉన్నత పాఠశాలలో బుధవారం సైబర్ జాగృత దివస్ కార్యక్రమంలో భాగంగా సైబర్ మోసాలపై విద్యార్థులకు బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఆన్‌లైన్ మోసాలు, సైబర్ మోసాలు పెరుగుతున్నాయని తెలిపారు. ఆన్‌లైన్‌లో ఉద్యోగాల కోసం వెతకడం, కస్టమర్ కేర్ నెంబర్లు సెర్చ్‌చేయడం, మొబైల్ ఫోన్‌కు లింక్‌లు పంపించి ఎరవేస్తారని అన్నారు. ఆ లింక్‌లు క్లిక్ చేయగానే బ్యాంకు ఖాతాలో ఉన్న డబ్బులను కాజేస్తారన్నారు. గుర్తు తెలియని నంబర్ల నుంచి మెస్సేజ్ లింక్‌లు వస్తే ఓపెన్ చేయవద్దని, ఓటీపీ, బ్యాంకు ఖాతా, ఏటీఎం నంబర్లు ఎవరికి చెప్పవద్దన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో టూ టౌన్ ఎస్ఐ మహేందర్ పాల్గొన్నారు.

లక్సెట్టిపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): లక్సెట్టిపేట పట్టణంలోని కరీంనగర్ చౌరస్తాలో లక్సెట్టిపేట పోలీసులు సైబర్ దివస్, డిజిటల్ అరెస్టులపై బుధవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్సై-2 రామయ్య మాట్లాడుతూ ప్రజలు సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మోసపోయినట్లు గుర్తిస్తే వెంటనే 1930 నంబర్, పోలీసు వెబ్‌సైటులో గానీ ఫిర్యాదు చేయాలని సూచిచారు. కార్యక్రమంలో ఎస్సై వెంట బ్లూకోల్ట్స్ పోలీసులు లక్ష్మణ్, రాజు, మొగిళి ఉన్నారు.

నస్పూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాలపై నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సంఘమల్లయ్య పల్లెలో బుధవారం సాయంత్రం పోలీసులు ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సుగుణాకర్ మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

హాజీపూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాపల్లి గ్రామంలో సైబర్ మోసాలపై బుధవారం ఎస్ఐ సురేష్ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

దండేపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం పోలీసులు సైబర్ దివస్, డిజిటల్ అరెస్టులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్సై ఉదయ్‌కిరణ్ మాట్లాడుతూ ఈమధ్యకాలంలో సైబర్ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వేమనపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వేమనపల్లి మండల కేంద్రంలో బుధవారం నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్ ఆధ్వర్యంలో సైబర్ జాగృతి దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఇటీవల కాలంలో సైబర్ మోసాలు పెరిగిపోతున్నాయని, వీటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పోలీసులు, యువకులు పాల్గొన్నారు.

చైనా మాంజా విక్రయిస్తే చర్యలు

దండేపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): చైనా మాంజాతో గాలిపటాలు ఎగురవేసిన. వాటిని షాప్‌లలో విక్రయించిన చర్యలు తప్పవని తాళ్ళపేట అటవీ రెంజ్ అధికారి ఎఫ్‌ఆర్‌వో సుష్మారావు అన్నారు. దండేపల్లి మండలం ముత్యంపేట, తాళ్ళపేట గ్రామాలోని కిరణం షాప్‌లలో బుధవారంఅటవీశాఖ అధికారులు, సిబ్బంది తనిఖీ చేపట్టారు. ఎఫ్‌ఆర్‌వో మాట్లాడుతూ కేంద్ర పర్యవరణ చట్టం 2016 ఉత్తర్వుల ప్రకారం చైనా మాంజా దారలను ప్రభుత్వం నిషేధించిందన్నారు. ఎవరైన చైనా మాంజాను రవాణా చేసినా నిల్వ ఉంచినా గాలిపటాలు ఎగురవేసినా 3నుంచి ఏడేళ్ల జైలుశిక్షతో పాటు రూ. 10వేల నుంచి 1లక్ష వరకు జరిమానా విధించడం జరుగుతుంది. ఎట్టి పరిస్థితిలో కిరణంషాప్‌లలో మాంజా దారలు విక్రయించవద్దని దుకాణ యాజమాన్యులకు సూచించారు. దాడులో ఎఫ్ఎస్‌వో,ఎఫ్‌బీవో, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జన్నారం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : కవ్వాల టైగర్ జోన్ పరిధిలోని గ్రామాల్లోని వర్తక దుకాణాల్లో చైనా మాంజ అమ్మితే చర్యలు తప్పవని జన్నారం ఎఫ్‌ఆర్‌వో సుష్మారావు తెలిపారు. బుధవారం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని గాలిపటాల విక్రయ షా‌ ఫుల్లో తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో అటవీ సిబ్బంది బోజ్యానాయక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఐటం నెం.04కలెక్టరేట్08

రైతుల ఖాతాల్లో ధాన్యం డబ్బులు జమ

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 317 వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి 147కోట్ల 24లక్షల రూపాయల నగదును సంబంధిత రైతుల ఖాతాల్లో జమ చేశామని అదనపు కలెక్టర్ మోతిలాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 97,220 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని పేర్కొన్నారు. 9,789 రైతుల ఖాతాల్లో డబ్బులు జమయ్యాయని తెలిపారు.

చెత్తాచెదారం తొలగించాలి

చెన్నూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో చెత్తాచెదారం ఎప్పటికప్పుడు తొలగించాలని జిల్లా పంచాయతీ అధికారి, మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్‌రావు సూచించారు. బుధవారం మండలంలోని కొమ్మెర, ముత్తరావుపల్లి గ్రామాల్లో పర్యటించారు. పారిశుధ్య పనులను పరిశీలించారు. సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీడీవో మోహన్, ఎంపీవో అజ్మత్ ఆలీ, పంచాయతీ కార్యదర్శులు మౌనిక, సత్యనారాయణ ఉన్నారు.

కిష్టంపేటలో క్రీడా పోటీలు

చెన్నూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యువజనోత్సవాల్లో భాగంగా బుధవారం క్రీడాపోటీలను ప్రిన్సిపాల్ పట్వర్ధన్, వైస్ ప్రిన్సిపల్ కిశోర్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వాలీబాల్, ఫుట్‌బాల్, క్రికెట్, రన్నింగ్, చెస్, ఖోఖో పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ ఇన్‌చార్జి శ్రీనివాస్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మత్స్యకారులకు అండగా..

- కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మత్స్య సంపద పథకం
- వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తుల రిజిస్ట్రేషన్‌కు అవకాశం

జైపూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల జీవనోపాధిని మెరుగుపరిచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం (పీఎంఎంఎస్‌వై) ప్రవేశపెట్టింది. మత్స్యకారులకు ఉపాధి అవకాశాలను కల్పించి మత్స్య సంపదను పెంచడమే ఈపథ కం ప్రధాన ఉద్దేశ్యం. పథకం లబ్ధి కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది.

మత్స్యరంగానికి సంబంధించిన ఇతర వ్యక్తులు ఈ పథకం ద్వారా లబ్ధిపొందవచ్చు. మత్స్యకారులు, మత్స్యకార్మికులు, చేపల విక్రయదారులు, మత్స్య అభివృద్ధి కార్పొరేషన్‌లు, స్వయం సహా యక సంఘాలు, ప్రైవేటు సంస్థలు సైతం ఈ పథకాన్ని వినియోగించు కోవచ్చు. చేపల పెంపకానికి నాణ్యమైన సీడ్ సేకరణ, నీటి నిర్వహణ ఈ పథకం ద్వారా కల్పిస్తారు.

8 రకాల యూనిట్లు

ఈ పథకం కింద 8 రకాల యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. మంచినీటి నిర్వహణకు హెచ్చరీలు, చేపల పెంపకానికి పాండ్స్ నిర్మాణం, రీ సర్క్యు లేటరీ ఆక్వా కల్చర్ సిస్టమ్, జలాశయంలో చేపల పెంపకం, ఇన్సలేటెడ్ వాహనాలు, మూడు చక్రాల వాహనాల సరఫరా, చిన్న తరహా చేపల దానా మిల్లుల ఏర్పాటు చేసుకోవడానికి రుణాలు అందించనుంది.

రిజిస్ట్రేషన్ ఇలా...

ఆధార్‌కార్డు, ఫోన్ నెంబరుతో సమీపంలోని కామన్ సర్వీస్ సెంటర్ కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. హెచ్‌టీటీపీఎస్://పీఎంఎంఎస్‌వై.డీవోఫ్.జీవోవీ.ఇన్/ వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. యూనిట్లకు దరఖాస్తుల స్వీకరణ అనంతరం మత్స్యశాఖ అధికారులు విచారణ చేసి పథకానికి అర్హులైన వారిని ఎంపిక చేస్తారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

వై. సాంబశివరావు, మత్స్యశాఖ అధికారి, మంచిర్యాల

జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల్లో ఉన్న కామన్ సర్వీస్ సెంటర్‌లో ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసు కోవాలి. మత్స్య పారిశ్రామిక రంగంలో ఉన్న వారు దరఖాస్తుకు ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. మత్స్యకారుల జీవనోపాధికి ఈ పథకం దోహద పడుతుంది. అర్హులందరు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

సెపక్‌తక్రా క్రీడకు న్యాయనిర్ణేతలుగా గోలేటివాసులు


కె మల్లేష్


భాస్కర్

రెబ్బెన, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఈనెల 10నుంచి 14వరకు హన్మకొండలో జరిగే జాతీయస్థాయి సీనియర్‌సెపక్‌తక్రా క్రీడకు న్యాయనిర్ణేతలుగా మల్లేష్, భాస్కర్ ఎంపికైనట్టు తెలంగాణ రాష్ట్ర సెపక్‌తక్రా ప్రధానకార్యదర్శి ఆర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. వీరి ఎంపికపై ఆదిలాబాద్ ఒలింపిక్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్ నారాయరెడ్డి, తదితరులు అభినందించారు.

ఆర్థికసాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే


చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

కాగజ్‌నగర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే హరీష్‌బాబు అన్నారు. బుధవారం స్థానికంగా ఆయన కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ చెక్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బెజ్జూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో అటెండర్ పోస్టు ఖాళీ ఉందని పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో సునీత ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మహిళా అయి ఉండాలని, పదవ తరగతి చదివిన వారు అర్హులన్నారు.

కుదేలవుతున్న వ్యాపారం

రైతులకు కలిసిరాని కాలం, ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మహాలక్ష్మి' పథకంతో మహిళలు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం జిల్లాకేంద్రంలోని వ్యాపారాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. గిరాకీ లేక కొందరు ఇప్పటికే దుకాణాలను మూసివేశారు. మరికొందరు రెండు గదుల్లో ఉన్న తమ వ్యాపారాల్ని ఒకే గదికి పరిమితం చేసి అద్దె తగ్గించుకుంటున్నారు.



● గిరాకీలు లేక వ్యాపారుల లబోదిబో ● భారంగా దుకాణాల అద్దెలు.. వర్కర్ల జీతాలు

ఆసిఫాబాద్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొంత కాలంగా వ్యాపారాలు డీలా పడ్డాయి. దీంతో వ్యాపారులు లబో దిబోమంటున్నారు. ఏ వ్యాపారం చేసినా వ్యాపారులకు కొద్దో గొప్పో లాభాలను తెచ్చిపెట్టేవి. కానీ ఇటీవల ఏ ఒక్క వ్యాపారిని కదిలించినా వ్యాపారమే లేదు అనే మాట వినిపిస్తోంది. దీంతో జిల్లాలో వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారు.

జిల్లాలో రైతులకు పత్తి పంటే ఆధారం..

ఏ వ్యాపారం సరిగా సాగాలన్నా.. రైతు బాగుంటేనే. ప్రతి ఏడాది రైతులు పత్తిపంట చేతికి వచ్చిన తరువాత విక్ర యించి తమకు అవసరమైన వస్తు సామగ్రి, ఆభరణాలు ఇతర అవసరాలు కొనుగోలు చేస్తారు. కానీ ఈ ఏడాది కురిసిన అకాలవర్షాల కారణంగా పత్తి పంట ఆలస్యంగా చేతికి వచ్చింది. అందునా దిగుబడి సగానికి పైగా తగ్గింది. దీంతో పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితి. ఇక వస్తు సామగ్రి కొనే పరిస్థితి లేదు. ఈ ప్రభావం పరోక్షంగా వ్యాపారాలపై పడింది.


వ్యాపార సముదాయాల వద్ద ఏర్పాటు చేసిన టు లెట్ బోర్డు

మహాలక్ష్మి పథకంతో ఎఫెక్ట్..

జిల్లాలో వ్యాపారాలు డీలా పడడానికి మహాలక్ష్మి పథకం మరో కారణంగా చెప్పుకోవచ్చు. డిసెంబరు 9, 2023 నుంచి మహాలక్ష్మి పథకం అమలులోకి వచ్చింది. మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించింది. మహిళలకు ఉచిత ప్రయాణంతో జిల్లాలోని కొను గోళ్లపై ప్రభావం పడింది. తమకు అవసరమైన వస్తువులను, వస్త్రాలను, నగలను దూర ప్రాంతాల్లో ఉన్న మంచిర్యాల, కరీంనగర్, వరంగల్, హైదరాబాద్ లాంటి నగరాలలో కొనుగోలు చేస్తున్నారు. దీంతో స్థానికంగా కొన సాగుతున్న వ్యాపార వాణిజ్య సముదాయాలపై తీవ్ర ప్రభావం పడింది. వ్యాపారాలు దివాలా తీయడంతో వ్యాపారస్తులు తీవ్రంగా నష్టపోతున్నారు.

జిల్లా మార్కెట్‌లో గిరాకీ లేకపోవడంతో వ్యాపార సంస్థలన్నీ డీలా పడ్డాయి. దీంతో దుకాణాల అద్దె, వర్కర్‌ల జీతాలు చెల్లించలేక వ్యాపారస్తులు తీవ్రఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లా కేంద్రంలోని వ్యాపార వాణిజ్య సముదాయాలు గిరాకీలు లేక వెలవెలబోతున్నాయి. కొన్ని దుకాణాల్లో ఉదయం నుంచి సాయంత్రం బోణీ కూడా కావడం లేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జీతాలు ఇవ్వలేక..

ఇటీవల జిల్లా కేంద్రంలో గిరాకీలు లేక ఉత్తారాది రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు దుకాణాలను మూసుకుని వెళ్లి పోవాల్సిన పరిస్థితి నెలకొన్నది. గిరాకీలు లేకపోవడంతో రెండు దుకాణాలు ఉన్నవారు ఒక దుకాణానికే పరిమితం అవుతున్నారు. వేలకువేల అద్దెలు, వర్కర్ల జీతాలు చెల్లించ లేక పోతున్నామని వ్యాపారస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది వ్యాపారులు అద్దెకు తీసుకున్న గదులను ఖాళీ చేయడంతో జిల్లా కేంద్రంలో చాలాచోట్ల దుకాణాల ముందు టు-లేటు బోర్డులు దర్శనమిస్తున్నాయి.

గిరాకీలు లేవు..

సూర్యప్రకాష్ సొలంకీ, వ్యాపారి, ఆసిఫాబాద్



కొంత కాలంగా మార్కెట్‌లో గిరాకీలు లేవు. మహాలక్ష్మి పథకంతో మహిళలు ఇతర ప్రాంతాలకు వెళ్లి వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. దీంతో స్థానిక వ్యాపారాలపై ప్రభావం పడింది.

మధ్యాహ్నం 12 అయినా బోణీ కావడం లేదు

పత్తి హరిప్రసాద్, వ్యాపారి, ఆసిఫాబాద్



మధ్యాహ్నం 12అయినా బోణీ కావడం లేదు. వ్యాపారులు పూర్తిగా డీలాపడ్డాయి. అద్దెలు, వర్కర్ల వేతనాలు చెల్లించడం కష్టంగా మారింది. గతేడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది వ్యాపారాలు ఆశించిన స్థాయిలో నడవడం లేదు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవండి


రక్తదానం చేస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రక్తదానం చేసి ప్రాణపాయ స్థితిలో ఉన్నవారికి ప్రాణదాతలుగా నిలవాలని జిల్లా వైద్యాధికారి సీతారాం అన్నారు. బుధవారం ఆర్టీసీ డిపో ఆవరణలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా టీజీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో సీతారాం మాట్లాడుతూ ఆర్టీసీసంస్థ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎంతో మంది సమయానికి రక్తం లభించక మృత్యువాత పడుతున్నారని, వారికి అందజేయడం వల్ల ప్రాణదాతలుగా నిలుస్తారన్నారు. కార్యక్రమంలో డీఎం విశ్వనాథ్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎస్‌టీఐ సరియా, ఏడీసీ శంకర్, ఎస్‌టీఐ భారతి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో వ్యవసాయ సర్వీసు కనెక్షన్లపై ప్రత్యేక దృష్టి

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యవసాయ సర్వీసు కనెక్షన్లు మంజూరుకు ప్రత్యేక దృష్టిసారిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎస్‌ఈ రాథోడ్‌శేషరావు అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గతేడాదిలో జిల్లాలో 987వ్యవసాయ సర్వీసుకనెక్షన్లను మంజూరు చేశామన్నారు. కనెక్షన్లు మంజూరుకు సత్వరచర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆన్‌లైన్ ద్వారా సర్వీసు కనెక్షన్లను అందిస్తామని దీంతో రైతులకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించే దిశగా పొలంబాట కార్యక్రమాన్ని చేపట్టి వ్యవసాయ సర్వీసుల మంజూరుకు అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు.

చదువుతోనే అభివృద్ధి: ఏఎస్పీ చిత్తరంజన్

రెబ్బెన, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): చదువుతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. బుధవారం మండలంలోని కొలాంగూడలో ఆయన దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలో చేర్పించాలన్నారు. యువత వ్యసనాల బారిన పడవద్దన్నారు. గ్రామాల్లో అపరిచత వ్యక్తులు కనిపిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో సీఐ బుద్దేస్వామి, ఎస్సై చంద్రశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.

లింగాపూర్: ఆదివాసీ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు కృషిచేస్తామని ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. మండలంలోని చోర్‌పెల్లిలో పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భగాంగా బుధవారం ఆయన దుప్పట్లను పంపిణీ చేశారు. ఆదివాసులకు రోడ్డు, వైద్యం, విద్య, తదితర మౌలిక వసతుల కల్పనకు జిల్లా కలెక్టరు, ఎస్పీ, ఐటీడీఏ పీవోల దృష్టికి తీసుకెళ్లి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జైనూర్ సీఐ రమేష్, లింగాపూర్ ఎస్ఐ గంగన్న, సిర్పూర్(యు) రాజన్న, చోర్‌పెల్లి గ్రామపటేల్, మాజీసర్పంచులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ బౌద్ధ ధమ్మ ధ్వజ్ దివస్


వాంకిడిలో నివాళులు అర్పిస్తున్న బౌద్ధ మహాసభ సభ్యులు

వాంకిడి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని జేత్వాన్ బుద్ధవిహార్‌లో బుధవారం ధమ్మధ్వజ్ దివస్‌ను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గౌతమ బుద్ధుడు, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్, జయరాం, ఉపాసక్ పాండు, శిరీషన్, రాజేంద్రప్రసాద్, హంసరాజ్, రోషన్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

వాంకిడి/కెరమెరి/జైనూర్/పెంచికలపేట, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వాంకిడి, కెరమెరి, జైనూరు, పెంచికలపేట మండలాల ఎస్సైలు ప్రశాంత్‌కుమార్, విజయ్‌కుమార్, సాగర్, కొముర‌య్యఅన్నారు. బుధవారం వారు ఆయా మండలాల్లోని ప్రభుత్వపాఠశాలల విద్యార్థులకు సైబర్ క్రైంలపై అవగాహన కల్పించారు. ఫోన్లలో ఓటీపీ, ఓఎల్‌ఎక్స్, పేటీఎం, గూగుల్‌పే, ఫోన్‌పే, కేవైసీలను అప్‌డేట్‌చేయమని వచ్చే మెస్సెజ్‌లకు స్పందించకూడదన్నారు.

కాగజ్‌నగర్: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పట్టణ సీఐ రాజేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం వసుంధరడిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకు వివరాలు కావాలని కొత్త నెంబర్లతో ఎవరైనా ఫోన్లు చేస్తే చెప్పకూడదన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బెజ్జూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన నికాడి నాగేష్ కూతురు రేష్మ(8) మంగళవారం అనారోగ్యంతో మృతిచెందగా బుధవారం కాంగ్రెస్ నాయకులు హర్షద్‌హుస్సేన్ బాధితకుటుంబాన్ని పరామర్శించారు. నాయకులు మల్లేష్, షణ్ముకచారి, వైకుంఠం ఉన్నారు.

పోలీసు కుటుంబాలకు అండగా నిలుస్తాం

● ఎస్పీ డీవీ శ్రీనివాసరావు


ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎస్పీ

ఆసిఫాబాద్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరుల కుటుంబాలకు అండగా నిలుస్తామని ఎస్పీ డీవీ శ్రీనివాస రావు అన్నారు. ఇటీవల గుండెపోటుతో మరణించిన ఏఎస్సై మక్సుద్‌అహ్మద్ కుటుంబానికి రూ.8.6లక్షల విలువచేసే భద్రత చెక్ అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసుశాఖలో పనిచేస్తూ మృతిచెందిన బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని, ప్రభుత్వపరంగా అందాల్సిన ఇతర బెనిఫిట్స్‌ను తక్షణమే అందజేసేవిధంగా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ పెద్దన్న, ఏవో శ్రీనివాస్, జిల్లా పోలీసుసంఘం అధ్యక్షుడు ఎం విజయశంకర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ వర్మ, సీసీ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

చైనా మాంజాను అమ్మితే కఠినచర్యలు..

చైనా మాంజాను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లాపరిధిలో చైనా మాంజా విక్రయాలపై స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చైనా మాంజాతో మనుషులతో పాటు పక్షులకు ప్రమాదం పొంచి ఉందన్నారు. మాంజాతో తలెత్తే అనర్థాలపై అందరూ అవగాహన కలిగిఉండాలన్నారు. చైనా మాంజాను ఎవరైనా అమ్మినా, రవాణా చేసిన సమాచారం ఉంటే డయల్ 100కు తెలియజేయాలన్నారు.

ఎస్పీని కలిసిన డీఎస్పీ..

ఆసిఫాబాద్ జిల్లా డీసీఆర్బీ డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన కరుణాకర్ బుధవారం ఎస్పీ డీవీ శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కాగా కరుణాకర్ ఇదివరకే ఆసిఫాబాద్ జిల్లాలో డీఎస్పీగా బాధ్యతలు నిర్వహించి ఇటీవల బదిలీలో డీజీ ఆఫీస్‌కు అటాచ్ అయ్యారు. మళ్లీ ఆయన ఆసిఫాబాద్ జిల్లాలోనే డీసీఆర్బీ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు.

చైనా మాంజా విక్రయిస్తే కఠినచర్యలు

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): నిషేధిత చైనా మాంజాను విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని సీఐ రవిందర్ అన్నారు. బుధవారం పట్టణంలోని పతంగుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చైనా మాంజాతో మనుషులు, పక్షులకు ప్రమాదం పొంచి ఉందన్నారు. ఏవరైనా చైనా మాంజా విక్రయిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అయన వెంట ఎస్సై రాజేశ్వర్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

ప్రజామూత్రశాలల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలి

● కలెక్టర్ వెంకటేష్ దోత్రే

కాగజ్‌నగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలోని ప్రజామూత్రశాలల నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ వెంకటేష్‌దోత్రే అన్నారు. బుధవారం కాగజ్‌నగర్‌పట్టణంలో ప్రజామూత్రశాలల నిర్మాణపనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. మున్సిపాల్టీని శుభ్రంగా ఉంచడానికి స్వచ్ఛందసంస్థ ఆధ్వర్యంలో పురుషులకు, స్త్రీలకు వేర్వేరుగా మూత్రశాలల నిర్మించడం అభినందనీయమన్నారు. వ్యాపారులకు, మార్కెట్‌కువచ్చే ప్రజలకు ఈ మూత్రశాలలు ఎంతోసౌకర్యంగా ఉంటాయని తెలిపారు. ఈనెల 26కల్లా పనులు పూర్తి చేసి ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్లా మాట్లాడుతూ ప్రజామూత్రశాలల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్, కమిషనర్ అంజయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వపాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి..

రెబ్బెన: ప్రభుత్వపాఠశాలలో మౌలికవసతుల కల్పనకు కృషి చేస్తున్నట్టు కలెక్టర్ వెంకటేష్‌దోత్రే తెలిపారు. బుధవారం మండలంలోని నంబాలలో జడ్పీ పాఠశాను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ పాఠశాలలో పెండింగ్ సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. విద్యార్థుల డైట్ చార్జిలు పెంచినట్టు తెలిపారు. పదిపరీక్షల్లో అత్యుత్తమఫలితాలు సాధించాలన్నారు. ఇందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాంమోహన్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

మితిమీరిన వేగం.. బస్సు డ్రైవర్ తీరుపై ప్రయాణికులు నిరసన

ఆసిఫాబాద్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): బస్సును అతివేగంగా నడిపి రెండుచోట్ల ప్రమాదాలు చోటుచేసుకునే విధంగా వ్యవహరించిన డ్రైవర్‌సుధాకర్ తీరుపై ప్రయాణికులు బుధవారం రాత్రి ఆసిఫాబాద్ బస్టాండులో నిరసనకు దిగారు. ప్రయాణికులుతెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల నుంచి ఆసిఫాబాద్‌కు వస్తున్న ఆర్టీసీ బస్సులో సుమారు 30కిపైగా ప్రయాణికులున్నారు. మార్గమధ్యలో సోమగూడెం వద్ద ప్రొక్లయిన్‌కు తగలడంతో ప్రయాణి కులు కేకలువేశారు తిరిగి బూర్గుడ సమీపంలో రోడ్డుపక్కకు ఆగిఉన్న లారీని ఢీకొట్టేవాడన్నారు. రెండుచోట్ల ప్రమాదం నుంచి బయటపడినట్లు ప్రయాణికులు పేర్కొన్నారు. డ్రైవర్‌మద్యం తాగి నిర్లక్ష్యంగా బస్సును నడపడంపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈవిషయంపై డీఎం విశ్వనాథ్‌ను సంప్రదించగా ప్రయాణికులు ఆరోపించిన విధంగా డ్రైవర్‌ను స్థానికపోలీసు స్టేషన్‌లో పరీక్షనిర్వహించి మద్యం తాగినట్లు నిర్ధారణ అయితేచర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా శోభాయాత్ర

ఆసిఫాబాద్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం భజన మండలి ఆధ్వర్యంలో సీతరాముల శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. పట్టణంలని సాయిబాబా ఆలయం నుంచి శోభయాత్రగా జన్కాపూర్ కోదాండరామలయంవరకు కొనసాగింది. శోభయాత్రలో భక్తులు భజనలు, భక్తిగీతాలు పాడారు. అనంతరం ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, భక్తులు ప్రసాద్‌గౌడ్, పెంటయ్య, సంతోష్, మురళీగౌడ్, తిరుపతి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాధికారతతోనే మహిళల ఎదుగుదల

● వీసీలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

ఆసిఫాబాద్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా సాధికారత సాధిస్తేనే వారి ఎదుగదలకు అవకాశాలు లభిస్తాయని రాష్ట్రఆర్థికశాఖ మంత్రి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం ప్రజాభవన్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాలకలెక్టర్‌లు, అదనపు కలెక్టర్‌లు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. స్వయం సహాయకసంఘాల ద్వారా సోలార్‌పవర్ ప్లాంట్‌లు ఏర్పాటు ద్వారా 1000మెగా వాట్ల విద్యుత్‌ఉత్పత్తి చేసేందుకు ఇప్పటికే ఇంధన, గ్రామీణాభివృద్ధి శాఖల మధ్య కుదిరిన ఒప్పందం నేపథ్యంలో భవిష్యత్ కార్యచరణకు చర్యలు తీసుకుంటు న్నామని తెలిపారు. నూతన విద్యుత్ పాలసీ, ఇంధన, గ్రామీణాభి వృద్ధి శాఖ మధ్య గత సంవత్సరం ఒపందాన్ని జిల్లాలవారీగా అధికారులు ఉపయోగించుకుని అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. అయిదు సంవత్సరాలలో కోటి మంది మహిళలను కోటీశ్వర్లుగా మార్చాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ జిల్లాలో స్వయం సహాయ సంఘాలు, రైతుల ద్వారా సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.


వీసీలో పాల్గొన్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

మిషన్ భగీరథ ఈఈగా ఎంపీఎం సిద్ధిఖీ

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా మిషన్‌భగీరథ కార్యనిర్వాహక ఇంజనీర్‌గా ఎంఏఎం సిద్ధిఖీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కాగజ్‌నగర్ డివిజన్ డిప్యూటీ ఇంజనీర్‌గా పని చేస్తున్న ఆయనను జిల్లా కార్యనిర్వాహక ఇంజనీర్‌గా పూర్తి అదనపుబాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్రశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండాకాలం సమీపిస్తుండడంతో జిల్లా వ్యాప్తంగా నీటిఎద్దడి లేకుండా చూస్తామని, దీనికిగాను ప్రతిఒక్కరూ సహకారం అందించాలన్నారు.

మహాభారత పద్య పఠనం

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): శ్రీచంద్రశేఖరేంద్ర సరస్వతిస్వామి 31వ ఆరాధనోత్సవంసందర్భంగా పట్టణంలో విద్యార్థులతో మహాభారత పద్యపఠన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు మహాస్వామి చిత్రపటానికి పూలమాల వేసి విఘ్నేశ్వర ప్రార్థన చేశారు.

అందుబాటులో రాయితీ జొన్న విత్తనాలు

వాంకిడి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): రైతులకు రాయితీపై జొన్న విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు ఏడీఏ మిలింద్‌కుమార్ తెలిపారు. నాలుగు కిలోలల సంచి రూ.140 అందిస్తామని, రైతులు పట్టాపాసు పుస్తకం, ఆధార్ కార్డుతో ఏఈవోలను సంప్రదించాలన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి: ఆర్‌ఎస్పీ


కాగజ్‌నగర్‌లో క్రీడాకారులకు బహుమతులను అందజేస్తున్న ప్రవీణ్‌కుమార్

కాగజ్‌నగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లో రాణించాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని భట్టుపల్లిలో క్రికెట్ టోర్నీ ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి మెమోంటో, ట్రోఫీని అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సిర్పూరు నియోజకవర్గ ఇన్‌చార్జీ లెండుగురే శ్యాంరావు, నాయకులు పాల్గొన్నారు.

● బిట్ల వెంకటస్వామి కుటుంబానికి పరామర్శ..

ఆర్‌ఎస్పీ అభిమాని నాట్యాచార్యుడు బిట్ల వెంకటస్వామి తల్లి మృతిచెందగా బుధవారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు.

క్రికెట్ పోటీలను ప్రారంభించిన ఆర్‌ఎస్పీ

బెజ్జూరు: మండలంలోని పాపన్నపేట గ్రామంలో యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్రికెట్ పోటీలను బుధవారం ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రారం భించారు. క్రీడాకారులను ప్రోత్స హించేందుకు ముందుకు వచ్చిన పాపన్నపేట యూత్ కన్వీనర్ తిరుపతిని అభినందించారు. కార్యక్రమంలో నాయకులు రాంప్రసాద్, సలీం, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(యు)లో 8.3డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత

ఆసిఫాబాద్, జనవరి 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సిర్పూర్(యు) మండలంలో బుధవారం రాష్ట్రంలోనే అత్యల్పంగా 8.3డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. కెరమెరి మండలం ధనోరలో9.4, తిర్యాణి మండలం గిన్నెధరిలో 9.6, కెరమెరిలో 10.6, తిర్యాణి, జైనూరులలో 11.0 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రోజురోజుకు జిల్లాలో ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతుండటంతో ఏజెన్సీ గ్రామాల ప్రజలు చలికివణికిపోతున్నారు. నెగళ్లతో చలిమంటలుకాగుతూ చలినుంచి ఉపసమనం పొందుతున్నారు.

మాల మహానాడు భవనానికి నిధులు కేటాయించాలి

కాగజ్‌నగర్ టౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మాల మహానాడు సంఘం భవనం కోసం ఎమ్మెల్యే హరీష్‌బాబుకు ఆసంఘం నాయకులు బుధవారం వినతిపత్రం అందించారు. అనంతరం తెలంగాణ మాలమహానాడు2025 జిల్లాక్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దుంద్ర శ్రీనివాస్, ప్రతినిధులు పల్లం పురుషోత్తం, జూపాక అనిల్, తదితరులు పాల్గొన్నారు.